# ఆ సంఘటన

ఆ సంఘటన జరిగి చాలా రోజులైంది. అదంతా జ్ఞాపకం వచ్చినప్పుడు కళ్ళు చెమర్చుతాయి. జీవితంలో ఒక్కొక్కసారి అతి విచిత్రమైన సంఘటనలు జరుగుతాయని ఎవ్వరూ ఊహించలేరు. ఆ సమయాల్లో మనకి ఆశ్చర్యపడాలో, దుఃఖించాలో కూడా తెలియదు.నా జీవితంలో అలాంటి సంఘటన ఒకటి జరిగింది.

ఆ రోజున నేను నా స్నేహితుడు సుజాతరావు సరదాగా వేటకి వెళ్ళాం. ఏ జంతువులూ దొరకలేదు. అడవిలో కబుర్లు చెప్పుకుంటూ తిరుగుతుంటే బాగా రాత్రియ్యింది. ఇక ఇంటికి పోదామన్నాన్నేను. వేటకువచ్చి ఉత్తచేతుల్తో ఇంటికి వెళ్ళడం మంచిది కాదన్నాడు సుజాతారావు.

ఆకాశంలో చంద్రుడు కనబడటం మానేశాడు. నల్లమబ్బులు పాకుతున్నట్టున్నాయి. కటిక చీకటిలో నడుస్తుంటే కాళ్ళకింద ఎండుటాకులు చప్పుడుచేస్తున్నాయి. మాకు ఎదురుగా పొదలు కదుల్తున్నాయని పసిగట్టాం. మా అడుగులు ఆగిపోయినాయి. మబ్బువిడింది. మసక వెల్తురు. పొదలు మళ్ళీ కదిలాయి. పొదల్లోంచి పెద్దపులి గావును నడిచివెళ్ళటం లీలగా కనిపించింది. సుజాతారావు నాకు సైగచేసి తను ముందుకు కదిలాడు. ఇద్దరం చెరోపక్కకు విడిపోయాం పెద్దపులిని వెదుక్కుంటూ. చాలాకాలం గడిచింది వెదకడంలో.... చిన్న చిన్న చినుకులు ప్రారంభమైనాయి. చీకటి. పెద్దపులి జాడ దొరకలేదు నాకు. ఒక్కణ్ణే ఏం చెయ్యాలో తెలియటంలేదు వర్షం పెద్దదవుతోంది. చెట్లకిందనుంచి తడుస్తూ నడుస్తున్నాను. సుజాతారావు ఏమయ్యాడో తెలియటంలేదు. పెద్దపులినిగాని మరిదేన్నిగాని వెదుక్కుంటూ వెళ్ళాడంటే దాన్ని చంపేదాకా ఊపిరయినా పీల్చుకోడు సుజాతారావు. వేట విషయంలో చాలా పట్టుదలగల మనిషి.

దక్షిణంవేపు లోయల్లోంచి తుపాకి కాల్పులు వినిపించాయి. సుజాతారావు పెద్దపులిని చంపివుంటాడు. నా మనసుకూడా కాస్త కుదుట పడ్డది.

వర్షంమరీపెద్దదయింది. ఉరుములూ, మెరుపులూతుపాకీ చప్పుళ్ళు వినిపించిన వైపు నడుస్తున్నాను తడుచుకుంటూనే. గుట్టలుదాటి చివరకి ఒక మైదానంలోకి వచ్చాను. ఏమీ కనిపించటంలేదు ఇప్పుడు. నేనొక్కణ్ణే టౌనుకు పోదామన్నా దారికనిపించదు. దారి వెదుక్కుంటూ కొండలూ గుట్టలూ ఎక్కడం తప్ప లాభం లేదు. అంటే నేనారాత్రి అడవులలోనే గడపాలి. నేనెంత ధైర్యవంతుణ్ణయినా సాయుధుణ్ణయినా క్రూర జంతువులు తిరిగే ప్రాంతంలో చెట్లకింద గడపటం శ్రేయస్కరం కాదు.

నడవటం ప్రారంభించాను. ఎంతసేపు నడిచానో తెలియదు. చాలాదూరంగా మినుకు మినుకుమంటూ దీపం కనిపించింది. కాస్త ఆధారం దొరికినందుకు చాలా సంతోషించాను. ఆ దీపం కనిపించేచోటుకి చేరుకుని ఈ రాత్రి గడపటం మంచిది. సుజాతారావు ఏంచేస్తున్నాడో.

రాళ్లూ రప్పలూ ముళ్ళపొదలూ దాటుకుంటూ చీకటినిచీల్చుకుని కనిపిస్తున్న వెలుగురేఖవేపు నడుస్తున్నాను త్వర త్వరగా. వర్షంతగ్గింది. నీళ్ళు పాయల్లారాళ్ళ లోంచి గల గలా పారుతున్నాయి. నక్షత్రాలు నీళ్ళల్లో ఈదుతున్నాయి. కీచు రాళ్ళ చప్పుడు. క్రమంగావెలుగు పెద్దదవుతుంది. వెలుగుకీ నాకూ మధ్య దూరం తగ్గుతోంది.... దగ్గరకు వెళ్ళాను. వెలుగు నలుచదరంగా కిటికీలోంచి బయట చీక ట్లోకి పడుతోంది. మరికొద్ది దూరం నడిచి చివరికి అపరిచితమైన ఆ చిన్న పాత పెంకుటింటి తలుపుదగ్గర నిలబడ్డాను.

"ఎవరు లోపల?" అని పిలిచాను. నా స్వరాన్ని రివ్వుమని ఒక గాలితెర వచ్చి ఎటో తీసుకుపోయింది.

లోపల ఎవరూఉన్న అలికిడిలేదు. చినుకులు ఆకులమీద పడుతూ చప్పుడు చేస్తున్నాయి. పాత తలుపు నెమ్మదిగా తోసిచూశాను. కిర్రుమని చప్పుడు చేస్తూ తెరుచుకుంది. కిటికీలో దీపం. చీకట్లో ఎటువెళ్ళాలో తెలియని నాకు తనదగ్గిరికి ఆకర్షించింది దీపమే. చుట్టూవున్న చీకటిని చీల్చింది ఆ వెలుగు కిరణమే.

ఒక పక్క ఒక ముసలమ్మ వణుకుతూ కనిపించింది. తల మోకాళ్ళ మధ్య పెట్టుకుంది. ఎన్నో అనుభవాలు పొంది ముడతలు పడిన ఆ మొహంలో, దీపపు ఎర్రటి కిరణాలు నీడల రేఖలు గీస్తున్నాయి. చెక్కల తలుపు వేసిన చప్పుడికి తల కొంచెం ఎత్తిచూసింది. నామీంచి అవతలికి ఎక్కడికోచూసింది. గతంలోకి సూటిగా చూసిందా? చూస్తున్నా చూడనట్టే ఆ కళ్ళు పెదాలు విచ్చుకున్నాయి. కంఠస్వరం నూతిలోంచి మాటాడినట్టుంది.

'రా బాబూ నీ కోసం ఎదురుచూస్తున్నాను' అన్నది విచారమూ సంతోషమూ తెలియని ఏదో భావం ఆ కళ్ళల్లో ముడతలు పడిన మొహంలో మెరవడం చూడగలిగాను. నాకేమీ అర్థంకాలేదు. లోపలికడుగుపెట్టాను.

కుంపటి దగ్గిర ముడుచుకు కూచున్న ముసలతను నెమ్మదిగా దగ్గాడు. కుంపటిలో నిప్పులు నుసయిపోతున్నాయి. కొంచెం చలివేస్తుంది, బయట వర్షానికి గావును. నేను రావడం ఆశ్చర్యం కలిగించకపోవడం నాకాశ్చర్యం కలిగింది. ఒక సారి నన్ను చూసి, మామూలుగా ఎంతో పరిచయం వున్నట్టు, నెమ్మదిగా కుంపటి దగ్గర్నుంచి లేచాడు. ముసలమ్మ దగ్గరకొచ్చి చేతులు పట్టుకొని ఊతఇచ్చి లేవదీసి

నెమ్మదిగా నడిపించి కుంపటిదగ్గర కూచోపెట్టాడు. నన్ను చూస్తూ సన్నగొంతుతో చెప్పడం ప్రారంభించాడు.

"ఇంత సులువుగా దీన్ని కుంపటి దగ్గర కూచోబెట్టగలుగుతాననుకోలేదు. వాడికోసం బెంగపెట్టుకుని కృశించిపోయింది. మనిషి సహాయం లేకుండా నిలబడి, నాలుగడుగులు నడిచి, పదిహేనేళ్ళవుతుంది. నాకు కునుకు పడుతుందిగాని దానికి పట్టదు....ఎందుకో....ఎవరో వస్తున్నారని, వాడికబురు చెబుతారని దానికి పిచ్చి నమ్మకం పట్టుకుంది. ఆ ఎవరో నువ్వే.... నీ కోసం చూస్తుంది. నీ అడుగుల చప్పుడు వినడంకోసం....నువ్వు చెప్పేది వినడంకోసం... ఐతే ఒకటి నాకుబాగా తెలుసు కబురు తెలియందే కన్ను మియ్యదు"

శల్యావస్థలో ఉన్నాడేమో ఈ నాలుగు మాటలు మాటాడేసరికి చెప్ప లేనంత ఆయాస పడ్డాడు. నన్ను కూర్చోమని పీటవైపు సైగచేశాడు. నా బట్టలు తల పూర్తిగా తడిసిపోయాయి. బాలా ఆశ్చర్యపడుతూ—నోరు తెరిస్తే ఏ మాటా డాలో తెలియని పరిస్థితిలో పీటమీద కూచున్నాను. ఆ ఇద్దరి ప్రవర్తనా నాకు కొస్తకూడా అర్థంకాలేదు.

ఆ ముసలమ్మ నన్ను చూడగానే, నీకోసం ఎదురు చూస్తున్నానని యెందుకన్నదో, నాకోసం అసలు యెందుకు ఎదురు చూసిందో! ఆ సమయానికి నేనక్కడికి ఎందుకువెళ్లానో! ఆ ఇద్దరికి నాకూ వున్న సంబంధం ఏమిటో.. యేవీ తెలియటంలేదు. అంతా అయోమయంగావుంది. ముసలతను రెండు పిడకలు విరిచి ఆరిపోతున్న కుంపట్లో వేశాడు. గోడికి చేరబడి కుంపటి ముందు ఆ ముసలమ్మ అట్లా కూచునేవుంది.చూపులు చీకట్లో దేనికోసమో వెతుకుతున్నాయి. దీపం కళ్లల్లో వెలుగుతోంది. చాలాసేపు ఎవరూమాట్లాడలేదు.బరువుగా కొన్ని క్షణాలు దొర్లాయి.

పక్షులు కూస్తున్నాయి. తెల తెలవారుతున్నది. చేతులో తుపాకి కింద పెట్టాను. కొంచెం చప్పుడయింది. ఆ చప్పుడుకు ముసలమ్మ కళ్ళు నావేపు తిప్పి చూసింది. చాలా ప్రేమగా, సూటిగా, ఆర్ద్రంగా నా కళ్ళలో చూస్తూ—

"ఇప్పుడు చెప్పు. నా కొడుకునుంచి ఏం కబురు తెచ్చావు చెప్పు.ఏం కబురు తెచ్చావు" అన్నది. మాటలు వణికాయి.

ఆ సూటి చూపులకి, ఆమె మాటలకీ నేను తట్టుకోలేకపోయాను. నా హృదయంలో మెత్తని భాగంలో ఎవరో పొడిచినట్టయింది. ఆ మాటలు నాకర్థం కాలేదని తెలిసిన ముసలతను ఒక్క వూపులో నా పక్కకుజరిగి చెవిలో ఊదాడు.

"వాడి పేరు అయ్యన్న. మా అబ్బాయి సంగతి"

అయ్యన్న ...!నా జ్ఞాపకాలు పదిహేనేళ్ళ వెనక్కివెళ్ళాయి. నా కళ్ళముందు

కనిపిస్తున్నా ముసలమ్మ కదిలిపోయి మనోనేత్రంలో గోదావరీ, లాంచీలూ, అయ్యన్నా నిలిచారు. రాజమండ్రి పడవలరేవు కోలాహలం, లాంచీల చప్పుడు అన్నీ చెవుల్లో రింగుమన్నాయి. అయ్యన్నను నేను బాగా ఎరుగుదును. లాంచీలో డ్రైవరుగా పనిచేసేవాడు. నేను కొత్తపేట, రాజోలు, దొడ్డిపట్ల, నరసాపురం వగైరా క్యాంపులు వెళ్తున్నప్పుడు కనిపించేవాడు. "ఏవండీ సార్" అని గౌరవంగా పలకరించే వాడు. మూడేళ్ళ పరిచయం. ఆ శాంతం, ఆ సౌజన్యం, ఆ నవ్వు.... అన్నీ గుర్తొచ్చాయి. అతనంటే లాంచీ నాకు దొరకకపోవడం ఉండదు. ఎంతదూరానకనబడినా లాంచీ ఆపేవాడు. అతని వల్లనే నా ప్రయాణాలు కాస్త సాఫీగా జరిగేవనే సంగతి ఒప్పుకోవలసిందే ఆఖరిసారతన్ని చూసిన రోజుగుర్తొచ్చింది. ఆ రోజు అయ్యన్న చెయ్యి విరిగి కట్టుకట్టుకుని లాంచీలో ఒకమూల కూచున్నాడు. ఆతని చేతికి కట్టు చూసి విషయం యేమిటనడిగాను. లాంచీ చక్రం తిప్పుతుంటే పొరపాటున చెయ్యి పడి విరిగిందన్నాడు. సానుభూతి చూపించాను. ఆ తరువాత నాలుగైదు నెలలు అయ్యన్న కనిపించలేదు. ఈలోగా నాకు రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఒకసారి రాజోలు వెళ్ళవలసివచ్చింది. ఆ రోజు లాంచీ ఎక్కినప్పుడు కొత్తడ్రయివరు కనిపించాడు. అయ్యన్న గురించి అడిగితే-చాలా జబ్బు చేసిందనీ, చచ్చిపోయాడనీ చెప్పాడు. అయ్యోపాపం చిన్నవయసేకదా-చచ్చిపోయాడా-అని చాలా బాధపడ్డాను. ఆ తరువాత ఒకటి రెండుసార్లు జ్ఞాపకం వచ్చాడు. తరువాత-యింత వరకూ అయ్యన్న జ్ఞాపకం రాలేదు. రావలసినంత పెద్ద అవసరమూ కలుగలేదు.

ముసలతను కొంచెం తగ్గాడు. ఆ ముసలమ్మ మొహంలో ఆతృత కనిపిస్తోంది. నా కళ్ళల్లో "నా కొడుకు గురించి యే సంగతులూ చెప్పలేవా? అన్నట్టు దీనంగా బాధగా చూస్తున్నది. నేను అన్నిసంగతులూ ఎలా. పరిచయమయ్యాడో ఎంత మంచివాడో, చెప్పాను. చచ్చిపోయాడనే సంగతిమటుకు చెప్పలేదు నా మాటల్లో ప్రతిఅక్షరమూ శ్రద్ధగావిన్నది. కొడుకుమీద ప్రేమ, మమకారం ఆమె కళ్ళలోంచి ఉబికి మొహం అంతా ఒక్క క్షణం ఉజ్వలంగా వెలిగింది.

"నా కొడుకు.... అయ్యన్న.... వాడినుంచి కబురు తెలిసింది, యివ్వాళ. చాలు.... ఇకనాకేం కోరుకోడానికీ, ఆశించడానికీలేదు...." అంటుంటే ఆమెగొంతులో జీర వచ్చింది. యిన్నాళ్ళనుంచీ కొడుకుని చూడాలని కన్న కలలు తీరాయి. గనక ఆ ఆనందం ఒక్కసారే అనుభవిస్తున్నట్టుంది. ఆ కళ్ళల్లో అంతకంతకు మెరుపు పెరిగింది. ఆనందాశ్రువులు చాలా సంతృప్తిగా నిట్టూర్చింది. ఈ జీవితమూ. దుఃఖాలూ, సుఖాలూ, కలలూ, ఆశలూ అన్నీ ఒక్కసారే ఆ కళ్ళల్లో ప్రకాశించాయి. బాధలకీ మమతలకీ అతీతంగా చాలా దూరంగా ఒక్క చూపుచూసింది. అంతే.... తల నెమ్మదిగా ముందుకు వాలిపోయింది.

నా కళ్ళముందు తృటిలో జరిగిన ఈ సంఘటనకి దిగ్భ్రాంతుణ్ణయ్యాను. యెందుకో గుండె బరువెక్కి వూపిరి సలపనంత బాధపడ్డాను. ఎదురుగా వున్న దీపానికి కిరణాలు వొచ్చినయ్. కళ్ళు తుడుచుకున్నాను. గొంతు పూడిపోయింది.

బాగా తెల్లవారినట్టుంది.

ముసలతను ఏమీ మాట్లాడలేదు. కన్నీరు ఆ మొహంమీద ముడతలలో జారుతోంది. ఆమె శాంతంగా నిర్వికారంగా నిద్రపోతున్నట్టుంది.

బయట మళ్ళీ వాన—హోరున కురుస్తోంది.

"వాడు....అయ్యన్న... వాడువచ్చిపోయాడు కదూ—నువ్వు చెప్పలేదుకదూ ముసలిదానితో.... కానీ నాకు తెలుసు...." అన్నాడు. అతని గొంతు దీనంగా వీపరీతమైనా బాధతో జీరబోయింది.

నా కాశ్చర్యం వేసింది.ఎలా కనిపెట్టగలిగాడా?అని.తలవూపాను మౌనంగా. కొద్దిక్షణాలు వూరుకొని మెల్లగా చెప్పడం ప్రారంభించాడు.

అయ్యన్న ఒక్కగానొక్క కొడుకు. చాలా పెంకితనంగా తిరిగేవాడు. తల్లి దెబ్బలాడితే ఇల్లువదలి వెళిపోయాడట-నేటికి పాతికేళ్ళ క్రితం. కొన్నాళ్ళకు వస్తాడులే అనుకుందట ఆ తల్లి. రాను రాను పుత్రశోకంతో కుంగిపోయింది. నేనిప్పుడు కూచున్న పీటమీదే చిన్నప్పుడు అయ్యన్న కూచునేవాడట. ఈ మధ్య మగిషి మరీ పిచ్చిదానిలా తయారయ్యింది. వాడినుంచి కబురు తెలియడం, నేను ఆ పోవడం ఒక్కసారే జరుగుతాయని తరుచు అనడం ప్రారంభించిందట నిన్న కూడా అన్నదట.

వర్షం తగ్గింది. సుజాతారావు ఏమైనట్టు? ఎక్కణ్ణుంచో తీతువుపిట్ట అరుపు వినిపించింది.జరిగిన సంగతులన్నీ చెప్పి ముసలతనునెమ్మదిగా రెప్పలువాల్చాడు. అడవి గాలులు వీస్తున్నాయి.

లేచి నిలబడ్డాను. ముసలతనిలో కదలికలేదు. కదపడానికి ధైర్యం చాలలేదు. మెల్లిగా అక్కణ్ణించి కదిలాను.

* * *

కొన్ని సంఘటనలు యాదృచ్ఛికంగా జరుగుతుంటాయి. ఆ సంఘటన నాకు ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా నా కళ్ళు చెమ్మర్చకమానవు.

రచన : నవంబర్—డిసెంబర్ 1962, ప్రచురణ : స్నేహమంజరి, మాస పత్రిక అక్టోబరు 1966